క్లుప్తంగా...

108లో పైలట్, ఈఎంటీ ఉద్యోగాలు

శంషాబాద్: 108 అంబులెన్స్‌లో పైలట్, ఈఎంటీ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పైలట్‌గా పనిచేయడానికి కనీస విద్యార్హత పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జీ లేదా రెండు సంవత్సరాల హెవీ వెహికిల్ అనుభవం కలిగి ఉండాలి. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లకు బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎల్‌టీ అర్హత ఉండాలి. ఔత్సాహిక అభ్యర్థులు ఈ నెల 24న హయత్‌నగర్‌లోని 108 కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావల్సి ఉంటుంది. వివరాల కోసం 9154248818 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

బీజేపీ జాతీయ కార్యాలయ నిర్వహణలో మారుతి కిరణ్



శంషాబాద్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఆధ్వర్యంలో జాతీయ కార్యాలయ నిర్వహణ, కార్యాచరణ సభ్యులను నియమించారు. శనివారం ఢిల్లీలోని కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఇందులో శంషాబాద్‌కు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న భూనేటి మారుతి కిరణ్‌ను సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు ఆయన తొలిసమావేశంలో పాల్గొని జాతీయ అధ్యక్షుడు నడ్డా, బీఎల్ సంతోష్, రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

అత్తాపూర్: దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. జూన్ 5వ తేదీన ఎంఎంపహాడీకి చెందిన మహ్మద్ ఆలీమ్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 258 వద్ద సర్వీస్ రోడ్డులో బైక్‌పై వెళుతుండగా ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన యాక్టివా వాహనం ఢీకొట్టింది. దీంతో మహ్మద్ ఆలీమ్ రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడు. యాక్టివా వాహనంపై ఉన్న ముగ్గురు యువకులు వచ్చి అతడి వద్ద ఉన్న బైక్, సెల్‌ఫోన్‌లను తీసుకొని పారిపోయారు. అనంతరం మహ్మద్ ఆలీమ్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీఎస్ రాజేంద్రనగర్ పోలీసులు, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులు సయ్యద్ జుబేర్ ఆలీ, షేక్ ఒమర్, సయ్యద్ అఫ్రోజ్‌లుగా గుర్తించారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకోని శనివారం రిమాండ్‌కు తరలించారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

రాయదుర్గం: వాతావరణం ఎలా ఉన్నా విధులను నిర్వహించేవారే పోలీసులని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఇనార్బిట్ మాల్, రహేజా కార్స్‌లో భాగమైన నిర్మాణ్ సంస్థతో కలిసి సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ విధులను నిర్వహించే 1050 మందికి రెయిన్‌కోట్లను శనివారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహేజా నిర్మాణ్ సంస్థ, ఇనార్బిట్‌మాల్ వారు ముందుకురావడంను అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీ ట్రాఫిక్-1 హర్షవర్ధన్, డీసీపీ మేడ్చల్ ట్రాఫిక్ డివిశ్రీనివాసరావు,అ దనపు డీసీపీ పి శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ మాదాపూర్ ట్రాఫిక్ రణవీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నర్సయ్య, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్, నాగిరెడ్డి, రహేజా కార్స్ హెడ్ శ్రావణ్, ఇనార్బిట్ మాల్ సెంటర్ హెడ్ శరత్ బెలవాడి పాల్గొన్నారు.

కారు బీభత్సం.. వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: మద్యం మత్తులో కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నేతాజీ నగర్‌లో నివాసముండే రాఘవేంద్రరెడ్డి(28) ఓ ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజాము 2 గంటల నుంచి మణికొండలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహించాల్సి ఉంది. అర్ధరాత్రి 12 దాటాక ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై లంగర్ హౌస్ మీదుగా మణికొండుకు వెళ్తున్నాడు. సంగం వద్ద నుంచి వెళ్తుండగా అత్తాపూర్ నుంచి బాపూఘాట్‌బ్రిడ్జి మీదుగా ఓ కారు వేగంగా దూసుకువచ్చింది. అయితే సంగం రోడ్డు వద్దకు రాగానే రోడ్డు నేరుగా ఉందనుకొని ముందుకు వేగంగా వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రాఘవేంద్రరెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. కారుకు, డివైడర్‌కు మధ్య నలిగి తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అంతటితో ఆగక కారును తిప్పి పారిపోయే ప్రయత్నంలో మరో కారును ఢీకొట్టాడు. మద్యం మత్తులో ఉన్న కారు నడిపిస్తున్న వ్యక్తిని వాహనదారులు పట్టుకోగా వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. మృతుని భార్య మంగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఈసీవాగు అందాలు కనువిందు..

రాజేంద్రనగర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల హిమాయత్‌సాగర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. వరద నీరు గంటగంటకూ పెరుగుతుండడంతో జలమండలి అధికారులు హిమాయత్‌సాగర్ ఆరుగేట్లను పైకి ఎత్తి నీటిని దిగువకు వదిలారు. శనివారం మధ్యాహ్నం ఆరు గేట్లను ఎత్తడంతో వరద నీటిని చూసేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బుద్వేల్, కిస్మత్‌పూర్ బ్రిడ్జి, హిమాయత్‌సాగర్ బ్రిడ్జి, మోండికత్వ, లంగర్‌హౌజ్ బ్రిడ్జి ప్రాంతాల్లో సందర్శకులు వరద నీటిని చూసేందుకు తరలివచ్చారు. వరద నీటి వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రహదారి వద్ద వరద నీరు బ్రిడ్జి పై నుంచి వెళ్తుండడంతో దీనిని చూసేందుకు సందర్శకులు ఆశక్తి ప్రదర్శించారు. ఓఆర్ఆర్‌పై నుంచి ఈ నీటి ధార అందంగా ఉండడంతో పలువురు ఓఆర్ఆర్‌పైకి వెళ్లి వరద నీటిని చూస్తూ తమ సెల్‌ఫోన్‌లలో ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. మోండికత్వ, బుద్వేల్, కిస్మత్‌పూర్ బ్రిడ్జీ వద్ద సైతం సందర్శకుల సందడి కనిపించింది.



హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రహదారిపై వరద నీటిని చూస్తున్న వాహనాదారులు



కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద హనుమాన్ దేవాలయాన్ని ముంచెత్తిన వరద నీరు

ఓఆర్ఆర్‌పై వాహనాలు ఆపితే చర్యలు

హిమాయత్‌సాగర్ వరద నీటిని ఓఆర్ఆర్‌పై నుంచి వీక్షించేందుకు వాహనాదారులు పెద్ద ఎత్తున ఆసక్తి ప్రదర్శించారు. దీంతో ఓఆర్ఆర్‌పై వాహనాలు క్యూకట్టాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఓఆర్ఆర్‌పైకి చేరుకొని వాహనాదారులను పంపించి వేశారు. వాహనాలు ఆపితే ట్రాఫిక్ జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఓఆర్ఆర్‌పై వాహనాల వేగం అతివేగంగా ఉంటుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరూ ఓఆర్ఆర్‌పై నిలబడవద్దన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

బండ్లగూడ: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్ సాగర్‌లోని కార్యాలయంలో ఆయన సెక్షన్ల అధికారులు, సెక్షన్ సహాయకులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, బిల్ కలెక్టర్లు, జవాన్లు, ఎలక్ట్రీషన్స్‌తో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేయాలని సూచించారు. సెక్షన్ అధికారులను వారి విభాగానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది విధిగా తమ విధులను హాజరుకావాలని, సక్రమంగా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. విధులు నిర్వహించడంలో ఎలాంటి అశ్రద్ధ వహించరాదని తెలిపారు. సమావేశంలో ఎస్ఈ శివనంద్, డీసీపీ సాంబయ్య, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ యాదయ్య, వార్డు అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, ఎలక్ట్రీషియన్‌లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు రెండు రోజుల పాటు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో మల్లయ్య



సమావేశంలో పాల్గొన్న బీఎల్‌వోలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల బీఎల్‌వోలకు శిక్షణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిక్షణ సమావేశానికి రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో మల్లయ్య, ఉపకమిషనర్ రవికుమార్‌లు హాజరయ్యారు. సర్కిల్ పరిధిలోని 284 బూత్‌లకు చెందిన బీఎల్‌వోలు ఈ శిక్షణ సమావేశానికి హాజరవుతారు. శనివారం, సోమవారం రెండు రోజుల పాటు ఈ శిక్షణను అందిస్తున్నారు. బీఎల్‌వోలు చేపట్టవలసిన విధులు, క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు అవలంబించాల్సిన సలహాలు, సూచనలను అందించారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు స్వీకరిస్తున్న కొత్త ఓటర్లు, మార్పులు చేర్పులు తదితర వాటిపై ఈ శిక్షణ సమావేశంలో అవగాహన కల్పించారు.

ఆవిష్కరణలతో ముందుకు సాగాలి



బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్‌కోర్సులో లెసినియో యాప్, డాట్‌కామ్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

రాయదుర్గం: టీ20 క్యాబ్ లెసినియో సహకారంతో తెలంగాణ క్రీడాకారుల ప్రతిభను దేశవ్యాప్తంగా చాటాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని ఎమ్మార్ ప్రాపర్టీస్‌లోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్‌కోర్సులో లెసినియో యాప్, లెసినియో డాట్‌కామ్‌ను టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్‌ఓజా, మహిళా క్రికెటర్ సునీతానంద్ తదితరులతో కలిసి ఆమె శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆవిష్కరణలతో ముందుకు సాగి సమాజానికి తోడ్పడాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్‌ఓజా మాట్లాడుతూ క్రీడాకారులకు బంగారు భవిత ఉందన్నారు. ఇలాంటి యాప్‌లు గ్రామీణ క్రీడాకారులకు దోహదం చేస్తాయన్నారు. నిర్వాహకురాలు పి అనూషారెడ్డి మాట్లాడుతూ అందరికీ క్రీడలు, క్రీడాంశాలు అందుబాటులో ఉండేలా ప్రయత్నం చేస్తూ టీ20 క్యాబ్‌ను లిసినియో సహకారంతో ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇఫ్లూ ప్రొఫెసర్, ఓయూ మాజీ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఐఐటీ మద్రాస్, జేఎన్‌టీయూ మాజీ డీన్ డాక్టర్ రాజేశం, ఇంగ్లాండ్ బోల్టన్ యూనివర్సిటీ మాజీ డిప్యూటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కొండల్‌రెడ్డి, లెసినియో ముఖ్య సలహాదారు సూర్యప్రకాశ్‌రెడ్డి, పుల్లా నర్మదారెడ్డి, కబడ్డీ, బాక్సింగ్, టెన్నిస్ జాతీయ క్రీడాకారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నాయకులు విద్యావేత్త మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపార్కును సందర్శించిన లోకేశ్ జైశ్వాల్

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కును వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్, పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్ శనివారం సందర్శించారు. జూపార్కులో 20న గంధపు చెట్ల చోరీ, జూలో జరిగిన అభివృద్ధి, వన్యప్రాణులకు తీసుకుంటున్న చర్యలను స్వయంగా జూలో తిరుగుతూ తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ వన్యప్రాణుల ఆరోగ్యంపై తగిన సూచనలు, సలహాలు చేశారు. జూ అధికారులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. జూపార్కులో అక్రమంగా ఏడు గంధపు చెట్లను నరికిన ఘటనల్లో బాధ్యులను గుర్తించి కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జూపార్కులోని ఫారెస్ట్ స్టాఫ్, సెక్యూరిటీ సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



ప్రశాంతంగా జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

మూడు సెంటర్లలో నిర్వహణ

గచ్చిబౌలి: జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా స్కూల్‌లో 11వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జెడ్పీహెచ్ఎస్ లింగంపల్లి, జెడ్పీహెచ్ఎస్ కొండాపూర్, జెడ్పీహెచ్ఎస్ గచ్చిబౌలి కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. కాగా ప్రవేశ పరీక్ష నిర్వహణ తీరును, పరీక్షా కేంద్రాలను నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ టి గోపాల కృష్ణ, జేఎన్‌వి ప్రిన్సిపల్ డి విజయభాస్కర్, ప్రవేశ పరీక్ష ఇన్‌చార్జీ కె మట్టయ్య పరిశీలించారు.

అండర్‌బ్రిడ్జి.. మూడోరోజు రాకపోకలు బంద్

శేరిలింగంపల్లి: వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరదనీరు చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపిచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా వరద నీరు నిలిచింది. అండర్ బ్రిడ్జి కింద చేరిన బురదను తొలగిస్తే గానీ రాకపోకలు సాగుతాయి. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను, గచ్చిబౌలి నుంచి తారానగర్ మీదుగా భెల్ చౌరస్తా వైపు వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో వాహనాదారులకు ఇబ్బందిగా మారింది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు

గోల్కొండ: మొహర్రం నెల ముస్లింలకు ఎంతో పవిత్రమైన నెల అని రిసాల బజార్ ఆషుర్‌ఖాన్ ప్రతినిధి పాషాభాయ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఆషుర్‌ఖానాలో మొహర్రం ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా గోల్కొండలోని వివిధ ప్రాంతాల వారు ఆలంలను సందర్శించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పనిసంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆలంలకు దట్టి సమర్పించారు.

నిండు కుండలా శాతం చెరువు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండులా మారాయి. గోల్కొండ కోట నయాఖిలాలోని శాతం చెరువులో భారీగా వరదనీరు చేరింది. కాగా అధికారులు రెండు రోజులుగా నీటితో నిండిన శాతం చెరువును సందర్శిస్తున్నారు. చెరువులో చేరిన వర్షపు నీటిని చెరువు తూము ద్వారా కందకంలోకి వదులుతున్నారు. నీరు కందకాల నుంచి నాలాలో కలుస్తున్నది. చెరువులో చేరుతున్న వరదనీటిని చూసి నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్తగా వారు తమ తమ విలువైన వస్తువులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. మరికొందరు వర్షాలు వరుసగా కురుస్తుండటంతో చెరువుని ఆనుకుని ఉన్న వారు ఇళ్లకు తాళాలు వేసి తమ బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఇదిలా ఉండగా షేక్‌పేట్‌లోని కొత్త చెరువు సైతం వరదనీరు వచ్చి చేరుతుంది.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోల్కొండ: వర్షాకాలంలో అధికారులు తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా, ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పైప్‌లైన్ పనుల కారణంగా ప్రధాన రహదారుల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ట్రాఫిక్‌ను నియంత్రించడంలో ట్రాఫిక్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. టోలిచౌకి చౌరస్తా వద్ద రోడ్డుకు 4 వైపులా కూడా పార్కింగ్ నియత్రణకు సిబ్బంది లేరని, దీనివల్ల టోలిచౌకి చౌరస్తా దాటాలంటే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. టూంబ్స్ రోడ్డు, నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకి, గోల్కొండ బంజార దర్వాజా తదితర ప్రాంతాలు ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని, ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పక్కా చర్యలు తీసుకోవాలని ఆయన టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్‌కు సూచించారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, డిప్యూటీ ఈఈ రామకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా బంగారు పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతి పేటలోని బంగారు పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎడ్లకాడి రవి, రవీందర్, ఎడ్లకాడి సూర్యం, ఎడ్లకాడి చందు, బాబురావు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రోడ్ల గురించి ఎమ్మెల్యే పట్టించుకోరా..?

అస్తవ్యస్త రహదారులను పరిశీలించిన బీజేవైఎం నేతలు

శంషాబాద్: మూడుసార్లు ప్రజలు గెలిపించినా కనీసం రహదారులు బాగు చేయించరా.. అస్తవ్యస్త రహదారులు మీకు కనిపించడం లేదా.. ఎమ్మెల్యే గారూ.. ఇవేమి రహదారులు అంటూ బీజేవైఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని రాళ్లగూడ కమాన్ నుంచి సిద్దులగుట్ట వరకు ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల దుస్థితిని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేవైఎం, బీజేపీ నేతలు శనివారం పాదయాత్ర చేసి పరిశీలించారు. సిద్దులగుట్టకు ఉన్న ప్రధాన రహదారి బాగు చేయించడంలో మున్సిపాలిటీ అధికారులు, ఎమ్మెల్యే వైఫల్యమే కారణమని మండిపడ్డారు. ప్రజల బాగోగులు పట్టని ప్రజాప్రతినిధులకు రానున్న ఎన్నికలే గుణపాఠంగా మారనున్నాయన్నారు. 15 రోజుల్లో రోడ్డును బాగుచేయించకపోతే శంషాబాద్‌లో ఎమ్మెల్యే పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, యువ మోర్చా అదనపు కార్యదర్శి మహేందర్, పట్టణ అధ్యక్షుడు దేవేందర్, నాయకులు శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, అనిల్, వినోద్, రాకేష్, శ్రీకాంత్, మహేష్, శ్రీను, విష్ణు, కింటు బంటి పాల్గొన్నారు.



రోడ్ల దుస్థితిని పరిశీలిస్తున్న బీజేవైఎంరాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

విలువలతో కూడిన విద్యార్జనతోనే భవిష్యత్తు

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి



సాక్షి సిటీబ్యూరో: చదువుతో పాటు సామాజిక అవగాహన, విలువలు అలవర్చుకుంటూ విద్యార్థులు ముందుకు సాగాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రముఖ బిజినెస్ స్కూల్ (ఐఎంటీ, హైదరాబాద్) తమ క్యాంపస్‌లో తాజాగా పట్టభద్రులైన విద్యార్థుల కోసం స్నాతకోత్సవ వేడుకను శనివారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను చదివింది కెమికల్ ఇంజినీరింగ్ అయినా, రసాయన శాస్త్రవేత్తగా పనిచేసినప్పటికీ, తన సుదీర్ఘ కెరీర్‌లో వివిధ రంగాల్లో వేర్వేరు పాత్రలు పోషించానని అంటూ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్. కె. శ్రీహర్ష పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు

అత్తాపూర్: కురుస్తున్న వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతలమయంగా ప్రమాదభరితంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ, కృష్ణానగర్, శివానగర్, 16 షెటర్స్, న్యూఫ్రెండ్స్ కాలనీ, గుమ్మకొండ కాలనీ తదితర ప్రాంతాలలోని రోడ్లు పూర్తిగా గోతులమయంగా మారాయి. ఒక అడుగు మేర గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. గోతుల్లో వరద నీరు నిలిచిపోవడంతో ఎక్కడ రోడ్డు ఉందో, ఎక్కడ గోతి ఉందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులమయమైన రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



హైదర్‌గూడలో గుంతలమయంగా మారిన రోడ్డు

హైదరాబాద్ జిమ్ ట్రైనర్‌కు జాతీయ అవార్డు



రాజేంద్రనగర్: హైదరాబాద్ ఫిట్‌నెస్ ట్రైనర్‌కు జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. రాజేంద్రనగర్‌కు చెందిన బీవీ శ్రీనివాస్ కుమార్ బెంగళూరు బ్లైండ్ వింక్ ఇండియా ఎక్స్‌లెన్స్ అవార్డుల్లో బెస్ట్ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హీరోయిన్ అమృతారావు చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డ్ అందుకున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండీ నామినేషన్లు రాగా... తెలంగాణ నుండి శ్రీనివాస్ పురస్కారం గెలుచుకున్నారు. శ్రీనివాస్ హైదరాబాద్ గోల్డ్స్ జిమ్‌లో 15 ఏళ్ళుగా సీనియర్ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నారు. జావెలన్ త్రో అథ్లెట్‌గానూ రాణించిన శ్రీనివాస్ అండర్-20 కేటగిరీలో శ్రీలంకతో పాటు రాష్ట్రంలో జరిగిన పలు పోటీల్లో పాల్గొన్నారు.

'మనూ'లో ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

- ఆగస్టు 3న కౌన్సెలింగ్
- దరఖాస్తునకు జూలై 31 చివరి తేదీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ హైదరాబాద్‌లో రెండవ దశ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) హైదరాబాద్‌లో రెండవ దశ అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవడానికి జూలై 31 చివరి తేదీ అని వివరించారు. ఐటీఐలోని ట్రేడ్‌లలో డ్రాఫ్ట్‌మెన్, సివిల్, మెకానిక్, రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ప్లంబర్‌వంటి ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. దరఖాస్తును ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ హైదరాబాద్ సెంటర్ నుంచి పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23008428 లేదా సెల్ నెంబర్ 9440692452లో సంప్రదించవచ్చని సూచించారు.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

రాజేంద్రనగర్: ప్రమాదభరితంగా మారిన మ్యాన్‌హోల్స్, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను అధికారులు పరిష్కరించడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో గత 20 రోజులుగా మ్యాన్‌హోల్ వద్ద పైపులు పగిలి మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలుకు వెళ్లేందుకు ఈ దారినే ఉపయోగిస్తుంటారు. మ్యాన్‌హోల్ వ్యవస్థ వేసి సంవత్సరాలు గడుసుతుండడంతో అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మ్యాన్‌హోల్స్ పగిలి మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికంగా తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రి సమయంలో పగిలిన మ్యాన్‌హోల్‌లో పడి వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో పగిలిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: ఈ సంవత్సరం గోల్కొండ కోట బోనాల సందర్భంగా జగదాంబిక మహంకాళి అమ్మవారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం వచ్చింది. శనివారం హుండీని లెక్కించారు. 9 పూజలకు గాను రికార్డు స్థాయిలో రూ.12,83,423 లు ఆ దాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. గత సంవత్సరం హుండీ ద్వారా రూ.9,45,000 ఆదాయం వచ్చిందని తెలిపారు.